- అమ్మకాలు లేక చిరువ్యాపారుల ఇబ్బందులు
- అల్పపీడన ప్రభావంతో ఆగకుండా కురుస్తున్న వర్షం
- అవస్థ పడుతున్న ఉద్యోగులు, విద్యార్థులు

ముసురుతో.. ముప్పతిప్పలు





జడివానకు వ్యాపారాలు సాగక విలవిల్లాడుతున్న రామకృష్ణ జంక్షన్ రైతు మార్కెట్ వద్ద చిరువ్యాపారులు, (ఇన్‌సెట్) ఎల్‌ఐసీ వెనుక భాగాన వర్షం తాకిడికి మూతపడ్డ దుకాణాలు

డాబాగార్డెన్స్: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో గత 24 గంటలుగా కురుస్తున్న జడివాన చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో చిరువ్యాపారాలు వర్షం వల్ల వ్యాపారాలు నిలిచిపోయి నష్టాలు చవి చూస్తున్నారు. రైతు మార్కెట్ విలవిల్లాడింది. ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు అడపాదడపా కురుస్తున్న వర్షానికి జనసంచారం లేక రోడ్లన్నీ వెలవెలబోయాయి. ఫుట్‌పాత్ వ్యాపారాలు సాగలేదు. పర్యాటక ప్రాంతాలకు మణిహారంగా నిలిచిన సముద్ర తీర ప్రాంతం మంగళవారం అల్పపీడన ప్రభావంతో బోసిపోయింది. నిత్యం పర్యాటకులు, సందర్శకులతో కళకళలాడే ఆర్కే బీచ్, గోకుల్ పార్క్, నోవాటెల్ బీచ్ వెలవెలబోయాయి. ఎక్కడా సందర్శకులు, పర్యాటకుల జాడ లేదు. చిన్న చిన్న దుకాణాలు మూతపడ్డాయి.

చిత్తడిగా రోడ్లు..

అల్పపీడనం ప్రభావం కారణంగా సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న చిరు జల్లులకు రోడ్లన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి. ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, అల్లిపురం, రెల్లివీధి, రామకృష్ణా జంక్షన్, బౌడారా రోడ్డు, 75 ఫీట్ రోడ్డు, వెలంపేట, దుర్గాలమ్మ గుడి ఏరియా, పూర్ణామార్కెట్, మెయిన్ రోడ్డు, పాత నగరం తదితర ప్రాంతాల రోడ్లన్నీ బురదతో నిండిపోయాయి. ఇదిలా ఉండగా పాఠశాలలు విడిచే సమయంలో పెద్దగా జల్లులు పడడంతో పిల్లలు తడిసి ముద్దయ్యారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కోస్తాంధ్రలో మంగళ, బుధవారాల్లో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో సామాన్య జనంతో పాటు చిరు వ్యాపారులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జోరువానలో గొడుగు కిందే వ్యాపారం చేస్తున్న వృద్ధురాలు

పొంగుతున్న గెడ్డలు.. కాల్వలు..

కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, కాల్వలు పొంగుతున్నాయి. పక్షం రోజులుగా గెడ్డలో పేరుకు పోయిన చెత్తా చెదారాలు.. వర్షపునీటి ధాటికి కుప్పలు తెప్పలుగా చేరుతున్నాయి.

ఇలా అయితే వ్యాపారం కష్టమే..

విరామం ఇవ్వకుండా వర్షం ఇలాగే పడుతుంటే వ్యాపారాలు ఎలా సాగుతాయి. మాలాంటి చిరు వ్యాపారులకు రోజంతా కష్టపడితేనే పూట గడిచేది. ప్రకృతి వైపరీత్యాల్లో మాలాంటి వారిని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– లక్ష్మి, మామిడిపండ్ల వ్యాపారి, రామకృష్ణా రైతుమార్కెట్

క్లుప్తంగా

జగన్‌ను కలిసిన కనకల



జగన్‌మోహన్‌రెడ్డితో కనకల ఈశ్వర్

డాబాగార్డెన్స్: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, నాగవంశం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కనకల ఈశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి యువత కీలకపాత్ర పోషించాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాని దృష్ట్యా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయడంలో యువత కీలకపాత్ర పోషించాలని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని కనకల ఈశ్వర్ పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

దూమ్ర వారాహి అవతారంలో అమ్మవారు



అల్లిపురం: బంగారుమెట్ట షిర్డీసాయి దర్బార్‌లో వెలసిన అనఘాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో వారాహి నవరాత్రుల సందర్భంగా అమ్మవారు ప్రతి రోజు ఒక ప్రత్యేక అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు మంగళవారం దూమ్ర వారాహి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని సంపంగి పూలు, యాలకులు, దాల్చిన చెక్క తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అలంకరించారు.

నేడు మహా వారాహి అవతారం..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బుధవారం మహా వారాహి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కుసుమ హరనాథుల నామ సప్తాహం



కుసుమ హరనాథుల వారు

డాబాగార్డెన్స్: దువ్వాడ రాజీవ్‌నగర్ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు కుసుమ హరనాథ నామసప్తాహం నిర్వహించనున్నట్టు ఆశ్రమ అధ్యక్షుడు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీఎస్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 168 గంటల పాటు (3వ తేదీ ఉదయం 5.45 గంటలకు ప్రారంభమయ్యే సప్తాహం 10వ తేదీ ఉదయం 5.45 గంటలకు ముగుస్తుంది) వివిధ భక్త బృందాలతో నిర్విరామంగా షోడసాక్షరి నామ సంకీర్తన ఉంటుందన్నారు. 3వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఉయ్యాల ఉత్సవం, 6వ తేదీ ఉదయం 10 గంటలకు లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ కుసుమ హరనాథుల లీలా కల్యాణం నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులు నామ సప్తాహంలో పాల్గొనాలని కోరారు.

వజ్రోత్సవ సంవత్సరంలోకి ఏఐఐఈఏ



సమావేశంలో పాల్గొన్న యూనియన్ సభ్యులు

అల్లిపురం: అఖిల భారత ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ వజ్రోత్సవ సంవత్సరంలోకి అడుగిడుతున్నందుకు సంతోషంగా ఉందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ అన్నారు. యూనియన్ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం జీవిత బీమా సంస్థ కార్యాలయంలో గల యూనియన్ సమావేశ మందిరంలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1951 జూలై 1వ తేదీన యూనియన్ ఆవిర్భవించి అపురూపమైన స్థానాన్ని సంపాదించిందన్నారు. బీమా ఉద్యోగుల హక్కుల కోసం పోరాటానికి నాంది పలికిన సంఘటిత శక్తి మాత్రమే కాదు, భారత సమాజం కోసం ఒక నైతిక ప్రమాణంగా కూడా ఎదిగిందన్నారు. కార్మిక ఉద్యమానికి వెలకట్టలేని సేవలందించిన నాయకులు సరోజ్ చౌదరి, చంద్రశేఖర్ బోస్, సునీల్ మైత్రా, ఆర్.పి.మన్‌చందా, ఎన్.ఎం.సుందరం వంటి మహోన్నత నేతలు ఏఐఐఈఏ ద్వారా వెలుగులోకి వచ్చారన్నారు. అధ్యక్షులు కామేశ్వరి మాట్లాడుతూ యూనియన్ సభ్యులుగా ఉండటం మహిళా ఉద్యోగులకు గర్వకారణమన్నారు. సంస్థను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ఆమె అన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

భాషా సాహిత్యాల సవ్యసాచి ఆచార్య తూమాటి దోణప్ప



దోణప్ప చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య నరసింహారావు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో ఆచార్య తూమాటి దోణప్ప శత జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆచార్య జిల్లా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆచార్య తూమాటి దోణప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ తూమాటి దోణప్ప గొప్ప పరిశోధకుడని, ఆయన జీవితం పరిశోధకులకు ఆదర్శమని కొనియాడారు. తెలుగు భాష గొప్పతనాన్ని, అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం మన భాషకు ఇచ్చే గౌరవమని అన్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్రె అప్పారావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో దోణప్ప శత జయంతి ఉత్సవాలు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. దోణప్ప ప్రియ శిష్యుడు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ఈ సభకు రావడం సభకు నిండుదనం తెచ్చిందని పేర్కొన్నారు. దోణప్ప తెలుగు భాషా సాహిత్యాలకు ఎంతో కృషి చేశారని, తెలుగు వ్యుత్పత్తి పదకోశంలోనూ పని చేశారని గుర్తు చేశారు. విశిష్ట అతిథి ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆత్మీయ అతిథి ఆచార్య గజ్జ యోహాన్ బాబు, ఆచార్య వెలమల సిమ్మన్నలు కూడా దోణప్ప పరిశోధనల గొప్పతనాన్ని, రచనల ప్రాముఖ్యతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీవీకే కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డి.వి. సూర్య, తెలుగు విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ స్పోర్ట్స్ చైర్మన్ కమలాకర్

డాబాగార్డెన్స్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ స్పోర్ట్స్ చైర్మన్ జీవీవీఎస్ కమలాకర్ పేర్కొన్నారు. నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులందర్నీ కలుపుకుని పార్టీని ముందుకు నడిపిస్తానని చెప్పారు. బీజేపీ ప్రభుత్వ విధానాలు, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టేలా కృషి చేస్తానన్నారు. పార్టీలో చేరాలనుకునేవారు 9948778888 నంబరులో సంప్రదించాలన్నారు. సమావేశంలో డీసీసీ వర్మ, పీసీసీ జనరల్ సెక్రటరీ గాదం మహేష్, కో ఆర్డినేటర్లు కేవీ సూర్యనారాయణ, ప్రియాంక, వెంకట రమణ, రామకృష్ణ, రజియాబేగం, పార్టీ సీనియర్ నాయకులు కస్తూరి వెంకట్రావు, చెన్నా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు ఘన సత్కారం



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



డాక్టర్ రియాజ్ అహ్మద్‌ను సత్కరిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

మహారాణిపేట: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కేజీహెచ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వైద్యులను సత్కరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, సీఎస్ ఆర్ ఎంవో డాక్టర్ హరికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు దేవుడితో సమానమని, మానవీయ కోణంలో నిరంతరం పని చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా వారి సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో సౌత్ నియోజకవర్గ నాయకుడు శివప్రసాద్‌రెడ్డి, 30వ వార్డు జనసేన అధ్యక్షురాలు యజ్ఞశ్రీ, సీనియర్ నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రియాజ్ అహ్మద్ సేవలు మరువలేనివి..

డాబాగార్డెన్స్: డాక్టర్స్ డే సందర్భంగా ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ రియాజ్ అహ్మద్‌ను కడప రిమ్స్ మెడికల్ కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్, గాయత్రి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వీపీ సత్యనారాయణ మంగళవారం సత్కరించారు. గత పాతికేళ్ల పరిచయంలో డాక్టర్ రియాజ్ ఇంగ్లీషు వైద్యంలో నయం కాని ఎన్నో రోగాలు హోమియో మందులతో బాగు చేశారని కొనియాడారు. రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఏ వైద్యం అయినా రోగికి స్వస్థత చేకూర్చడం ముఖ్యమన్నారు.

9న గిరి భక్తులకు ప్రసాదం పంపిణీ

మహారాణిపేట: డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి సింహాచల గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ప్రసాద వితరణ జరగనుంది. 15 సంవత్సరాలుగా చేస్తున్న సేవను ఈ సంవత్సరం కూడా చేయటానికి పలు ఏర్పాట్లు చేస్తున్నామని కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ ఫోరం నాయకులు సింగూరు నరసింగరావు, భూపతి సత్యనారాయణ, పట్నాల నాగ రామ్మోహనరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇడ్లీ, టమాటా బాత్, కొబ్బరి చట్నీ, బొంబాయి చెట్నీతో పాటు బెల్లం, మిరియాల పాలు, అరటి పండ్లు, ఔషధ సేవలుగా పెయిన్‌బామ్ ఇవ్వనున్నట్లు ఫోరం సభ్యులు గుండు వెంకటేష్, కట్టా రమేష్, కేతా సత్యనారాయణ తెలిపారు. మానవ సేవే మాధవ సేవగా భావించి స్వామివారి అనుగ్రహంతో 9వ తేదీన అయ్యప్పనగర్, మురళీనగర్ వద్ద సేవలందించనున్నట్లు ఫోరం సభ్యుడు బిర్లా రెడ్డి తెలిపారు.

పుష్పయాగానికి పువ్వులు తరలింపు



వివిధ రకాల పుష్పాలతో భక్తులు

ఎంవీపీ కాలనీ: శ్రీ గోవిందరాజ స్వామివారి పుష్పయాగానికి అవసరమైన పుష్పాలను విశాఖ నుంచి తిరుమలకు తరలించారు. కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పూలను సేకరించారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ వద్ద ఈ పుష్పాలను భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. అనంతరం మహిళా భక్తులు ఈ పూలను అందంగా తీర్చిదిద్ది ప్యాక్ చేశారు. సంకల్పం చెప్పుకొని, శాస్త్రోక్తంగా పుష్పయాగం కోసం ఈ పూలను తిరుమలకు పంపించారు. ఆధ్యాత్మికవేత్త హిమాన్షు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ పుష్పాలలో 3,000 కలువలు, 2,000 తామరలతో పాటు వివిధ రకాల పూలు ఉన్నాయి.

యువ కవులకు ఆదర్శం చోడగిరి



మాట్లాడుతున్న డాక్టర్ బండి సత్యనారాయణ

సీతంపేట: సమతా సాహితి నెలవారీ కార్యక్రమంలో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రముఖ శతకకర్త చోడగిరి చంద్రరావు సాహిత్యంపై పరిచయ సభ జరిగింది. డాక్టర్ మాటూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన సభకు ఎస్.ఆర్.వేమన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ చోడగిరి అంబేడ్కర్ వాద కవిత్వం రాశారన్నారు. ఆయన గొప్ప నిబద్ధత గల మహాకవి అని, యువ కవులు వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రధాన వక్త నేలపూడి బాపిరాజు మాట్లాడుతూ చోడగిరి రాసిన భీమశతకం, హృదయ వీణ శతకాలను సభకు పరిచయం చేశారు. చంద్రరావు కవి మాత్రమే కాదని, ఆయన ఒక వైతాళికుడని, ఆయన రాసిన పద్యాలు పండిత, పామరులను మెప్పించాయన్నారు. అంతకు ముందు చోడగిరి జీవిత విశేషాలను డాక్టర్ బండి సత్యనారాయణ సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కవులు సీయార్కే, సామాజిక ఉద్యమ నేతలు వి.వి.దుర్గారావు, బీర రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన పల్లా



కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పల్లా శ్రీనివాసరావు తదితరులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేతన్ గార్గ్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ విశాఖ నగరాభివృద్ధి, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించుకున్నారు.

ఘనంగా పరదేశమ్మ జాతర



ఎరుకల వీధిలో పరదేశమ్మ వారికి పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారి తిరువీధి ఉత్సవంలో తోడపెద్దు సేవ

అల్లిపురం: భక్తుల కొంగు బంగారం, 14 గ్రామాల ఆరాధ్య దైవం అల్లిపురం రాచపోలమాంబ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా మంగళవారం పరదేశమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా కుమ్మరి వీధిలో గల అమ్మవారి పెద్దింటి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం, తోడపెద్దు గరిడీతో, సాంప్రదాయ డప్పు వాయిద్యాల మధ్య మెయిన్ రోడ్డులోని అమ్మవారి సతకం పట్టు నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా సింహాలదేవిడి, ఎరుకల వీధిలో గల పరదేశమ్మ అమ్మవారి దేవాలయం వరకు తిరువీధి నిర్వహించారు. అనంతరం అక్కడ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రసాదాలు నివేదించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మ వారికి పూజలు చేశారు.

కార్పొరేటర్ పూర్ణిమ దాతృత్వం



మజ్జి శ్రీనివాసరావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురంలో నివసిస్తున్న వలంటీర్ కుటుంబ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు లివర్ సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అతని కుటుంబానికి ఆర్థికంగా సాయం అందించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.5 వేలు వైద్య ఖర్చుల కోసం అందజేశారు. వార్డు సమస్యల పరిష్కారంతో పాటు, ప్రజలకు అండగా ఉండటం తమ బాధ్యత అని ఆయన అన్నారు. మురికివాడ ప్రాంత వాసులు అధికంగా ఉన్న తమ వార్డుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, ఈశ్వరి, దేవి, మురళీ, శేఖర్, సాయి, రత్నకుమారి, సింధు, శైలజ, వైఎస్సార్‌సీపీ నాయకులు, దళిత సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న సీఏ విద్యార్థులు, సిబ్బంది

డాబాగార్డెన్స్: చార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ విద్యా సంస్థ మాస్టర్ మైండ్స్‌లో మంగళవారం రక్తదాన శిబిరం, సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మాస్టర్‌మైండ్స్ సీఏ విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైజాగ్ బ్రాంచ్ మాస్టర్ మైండ్స్ కళాశాల అడ్మిన్ ప్రిన్సిపాల్ చల్లా అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను చదువు, నైపుణ్యంతో పాటు సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా దేశ భక్తిని ఇనుమడింపజేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, మాస్టర్ మైండ్స్ వైజాగ్ బ్రాంచ్ అకడమిక్ ప్రిన్సిపాల్ ఎస్.దినేష్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వృద్ధురాలు



వృద్ధురాలిని ఆమె మనవడు మురళీకృష్ణకు అప్పగిస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం: వయసు రీత్యా వచ్చిన మతిమరుపుతో ఇంటి నుంచి వెళ్లిపోయిన వృద్ధురాలిని ఏయూటీడీ సిబ్బంది సంరక్షించి ఆమె మనవడికి అప్పగించారు. కోటవీధికి చెందిన ఊరుకుటి అప్పయ్యమ్మ (75) మానసిక స్థితి సరిగా లేక ఇల్లు విడిచి గత పది రోజులుగా రోడ్డుపై తిరుగుతోంది. ఆమెను హార్బర్ పోలీసులు గుర్తించారు. మహిళా హెడ్ కానిస్టేబుల్ గౌరీలక్ష్మి చేత వృద్ధురాలిని జీవీఎంసీ టీఎస్ఆర్ మహిళా వసతి గృహానికి తరలించారు. ఏయూటీడీ సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. దీంతో ఆమె కోలుకున్న తర్వాత కుటుంబ సమాచారం సేకరించారు. ఆమె మనవడిని షెల్టర్‌కి పిలిపించారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో మంగళవారం మనవడు దేవర మురళీకృష్ణకు ఆమెను అప్పగించారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ మేనేజర్‌గా వరప్రసాద్



స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్న వావ్ ప్రతినిధులు

మురళీనగర్: శ్రీలంకలోని దియాగామాలోని మహీంద్ర రాజపక్షే స్టేడియంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న 38వ శ్రీలంక ఇంటర్నేషనల్ మాస్టర్స్ ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్–2025కు ఇండియా టీమ్ మేనేజర్‌గా ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ మంగ వరప్రసాద్ ఎంపికైనట్లు విశాఖ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ (వీఏపీ) తెలిపింది. ఈమేరకు మురళీనగర్ సెక్టార్–8లోని వావ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయనను అసోసియేషన్ తరుపున అభినందించారు. ఈ పోటీల్లో భారతదేశం నుంచి 210 మంది అథ్లెటిక్స్ పాల్గొంటారు. ఆయనతో పాటు వావ్ కోశాధికారి ఎం.రామారావు గురువారం శ్రీలంక బయలుదేరి వెళ్తారు. కార్యక్రమంలో జనకులం ఫౌండేషన్ ధర్మకర్త, వావ్ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ యూత్ చైర్ పర్సన్, వావ్ పీఆర్‌వో వంశీ చింతలపాటి, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్ పాల్గొని వారికి స్పోర్ట్స్ కిట్స్, డ్రస్‌లు అందించారు.